## కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఎదులాపురం, ఏప్రిల్ 10 : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం, మీడియా సెంటర్ ఏర్పాటు వంటి వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. రవాణ, పార్కింగ్ సదుపాయాల పాటు భద్రతా పరమైన అంశాలను నిశితంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్టీవో వినోద్‌కుమార్ ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి..

నిర్మల్ అర్బన్/భైంసా, ఏప్రిల్ 10 : పవిత్ర రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం నిర్మల్, భైంసా పట్టణాల్లోని ఈద్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు రాజారెడ్డి, అనిల్‌కుమార్, ఎస్‌బీ సీఐ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



ఈద్గాను సందర్శించిన నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

# జలగోస

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా నీటి కరువు

- గుక్కెడు జలం కోసం తండాలు, గూడేల తండ్లాట
- పనిచేయని చేతి పంపులు.. మరమ్మతుకు నోచుకోని భగీరథ పైపులు
- అడుగంటిన భూగర్భ జలాలు, బోర్లు, బావులు, చెరువులు..
- కిలో మీటర్లు ప్రయాణించి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు
- చెలిమెలు, వాగుల నుంచి ఎడ్లబండ్లలో నీటి సరఫరా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు తాగునీటికి తండ్లాడుతున్నారు. చేతి పంపులు, బోర్లు, బావులు వట్టిపోవడంతో చుక్కనీరు దొరుకడం లేదు. గిరిజనులు, ప్రజలు కిలోమీటర్లు ప్రయాణించి కొండలు, కోనలు పాదరక్షలు లేకుండా దాటి నీటిని ఎడ్లబండ్లలో తెచ్చుకుంటున్నారు. చెలిమెలు, వాగుల నుంచి గంటల తరబడి నీటిని తోడుతున్నారు. ఉదయం, సాయంత్రం పని వదులుకుని నీటి కోసం తపిస్తున్నారు. సమయం అంతా నీటికి కేటాయించడంతో తమ పనులు చేసుకోలేక పోతున్నామని వాపోతున్నారు. కేసీఆర్ సర్కారు ప్రతి తండా, గూడెం, పల్లెలకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చి శుద్ధమైన జలం అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చిన్న చిన్న మరమ్మతులు చేయకపోవడతోంతో వందలాది గ్రామాలు తాగునీటికి గోస పడుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తాగునీటి కరువును నివారించడానికి చర్యలు తీసుకోవాలని, బోర్లు, చేతిపంపులు బాగు చేయించాలని గిరిజనులు, ప్రజలు కోరుతున్నారు.

- ఆదిలాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)



ముథోల్‌లో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

### ముథోల్

భైంసా, ఏప్రిల్ 10 : వేసవి ప్రారంభంలోనే ముథోల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తింది. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడం, నీటి వనరులు వట్టిపోతుండడంతో గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడుతున్నది. దీనికి తోడు గ్రామాల్లోని చేతి పంపులు పనిచేయకపోవడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటి సమస్యకు దారి తీసింది. ప్రజలు తాగునీటి కోసం బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలోని ముథోల్ మండలంలో ఒకటవ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో బుధవారం తాగునీటి కోసం ఖాళీ బిందెలతో క్యూలైన్‌లో నిలబడ్డారు.



### నిర్మల్

#### తాగునీటి ఇబ్బందిని తీర్చండి..



తాగునీటి ఇబ్బందిని తొలిగించాలి. ఊరందరి కోసం రూ.1.50 లక్షలు పెట్టి బోర్లు వేసినా ఫలితం లేదు. ఒక్క బోరుతోనే ఊరంగా నీటిని వాడుకుం టున్నాం. కరెంట్ కోతలు కూడా ఉండడంతో నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తుతున్నది.

- రాథోడ్ దన్‌రాజ్, రాణాపూర్.




ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దార్‌లొద్ది గ్రామంలో బోర్ నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

#### తిప్పలు పడుతున్నాం..



మా గ్రామంలో మిషన్ భగరీథ నీళ్లు సరిగా రాకపోవడంతో తాగునీటికి సమస్య ఉంది. గ్రామానికి దూరంగా ఉన్న బోర్ నుంచి మంచినీటిని తీసుకువస్తున్నాం. పొద్దంతా నీళ్లు మోసుకోవడానికి సమయం సరిపోతుంది. దీంతో వ్యవసాయం, ఇతర పనులు చేసుకోలేకపోతున్నాం. అధికారులు మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- గెడాం టేకుబాయి, దార్‌లొద్ది, ఆదిలాబాద్ రూరల్ మండలం





ఇటీవల వేసిన ఫెయిల్ అయిన మూడు బోర్లు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 10 : నిర్మల్ మండలంలోని రాణాపూర్ గ్రామం జాతీయ రహదారి పక్కనే ఉంది. దాదాపు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోయి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఆరు నెలల క్రితం మిషన్ భగీరథ నీరు రావడంతో ఇబ్బందులు లేకుండేనని.. పెరిగిన ఎండలతో భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తులు అందరూ కలిసి రూ.1.50 లక్షలు ఖర్చు చేసి 300 ఫీట్ల వరకు మూడు బోర్లను వేసినా నీటి చుక్క కూడా పడలేదు. గతంలో వేసిన బోరు నీటినే ప్రస్తుతం వాడుకుంటున్నారు. చెడిపోయిన చేతి పంపును మరమ్మతు చేయాలని, మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈనెల 19న గ్రామంలో భవానీ జాతరను నిర్వహిస్తున్నామని, నీరులేకపోతే ఎలా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నీటి గోసను తీర్చుకునేందుకు ఆరుగురు బోర్లను వేసుకున్నా ఫలితం లేదు. నిత్యం ఆరు గంటల కరెంట్ కోతలు విధిస్తున్నారని, ఒకవేళ కరెంట్ వచ్చినా వీక్‌గా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

### ఆదిలాబాద్

ఆదిలాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ నియోజకవర్గంలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీటిని పంపిణీ చేసింది. దీంతో తాగునీటి సమస్య లేకుండా పోయింది. మిషన్ భగీరథ పథకం నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. ఫలితంగా జిల్లాలోని మారుమూల గ్రామాలు, ఆదివాసీ గూడేలు, తండాల్లో నీటి సమస్య తీవ్రమవుతున్నది. వారం రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీరు వస్తుందని ప్రజలు అంటున్నారు. తాగునీటి బావులు, వ్యవసాయ బావులు వద్దకు అర కిలోమీటరు దూరం నడిచి నీటికి తెచ్చుకుంటున్నారు. ఎడ్లబండ్లపై డ్రమ్ములు పెట్టుకుని వ్యవసాయ బావుల నుంచి తీసుకొచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం మరో రెండు నెలలు ఉన్నందునా రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉందని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## నేడు రంజాన్ పండుగ

దండేపల్లి, ఏప్రిల్ 10 : ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైనది రంజాన్ మాసం. ముస్లింలు 30 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. రంజాన్ మాసం బుధవారం ముగియగా, షవ్వాల్ మాసంలోని మొదటి రోజున జరుపుకునే పండుగ ఈద్-ఉల్-ఫితర్. బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో గురువారం పండుగ జరుపుకోవాలని మత గురువులు ప్రకటించారు. యేటా పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. సామూహిక ప్రార్థనలకు ముస్లింలు సమాయత్తం అవుతున్నారు. ఈద్గాల వద్ద చెత్తాచెదారం తొలిగించి, రంగులు వేసి, షామియానాలు వేస్తున్నారు.



## ‘ఆసరా’ పెంపు ఉత్తమాటేనా?

- అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ ఊసేలేదు..
- ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- పింఛన్ల పంపిణీలో ఆలస్యం

నిర్మల్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పేదలకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. ఆసరా లబ్ధిదారులకు పింఛ న్ పెంచుతామని ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ఇచ్చే రూ.2,016 పింఛన్‌ను రూ.4 వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.4,016 నుంచి రూ.6వేలు పెంచుతామన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటేసిన పింఛన్‌దారులు తమ పింఛన్ డబ్బుల పెంపు ఎప్పుడో? అంటూ ఆశగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఆరు గ్యారెంటీలం టూ ప్రచారం చేస్తున్నా.. వాటి అమలుకు తెల్ల రేషన్ కార్డును తప్పనిసరి చేయడంతో చాలా మంది పేదలు పథకాలకు దూరమవుతున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలంటూ ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నప్పటికీ అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల తెల్ల రేషన్ కార్డు ఉండి కూడా గృహజ్యోతి అమలు కాకపోవడంతో చాలా మంది ధ్రువపత్రాలను వెంట బెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. అలాగే ఆసరా లబ్ధిదారులకు ఇప్పటికీ పాత పింఛనే అందిస్తున్నారు. డబ్బుల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ సర్కారు హయాంలో ప్రతినెలా 5వ తేదీలోగా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించగా, ప్రస్తుతం 20 నుంచి 25 రోజులు ఆలస్యంగా వస్తున్నాయి.



### 1,49,785 మంది లబ్ధిదారులు

నిర్మల్ జిల్లాలోని 1,49,785 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.34.28 కోట్ల ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తున్నది. వీరిలో వృద్ధాప్య పింఛన్లు 36,687 మందికి, వితంతు పింఛన్లు 37,176 మందికి, దివ్యాంగ పింఛన్లు 10,409 మందికి అందుతున్నాయి. అలాగే గీత కార్మికులు 285 మందికి, చేనేత కార్మికులు 49 మందికి, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు 231 మందికి, డయాలసిస్ రోగులు 53 మందికి, ఒంటరి మహిళలు 2128 మందికి, బీడీ కార్మికులు 62,310 మందికి పింఛన్లు అందుతున్నాయి. దివ్యాంగులకు రూ.4,016, మిగతా వారికి రూ.2,016 చొప్పున ప్రతినెలా అందజేస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రెట్టింపు చేసి, వెంటనే కొత్త పింఛన్‌ను అందజేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

#### కేసీఆర్ పింఛనే అస్తున్నది...



నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. అందరి పెండ్లిళ్లు అయిపోయినయ్. నాది నేను గుడిసెలో ఒక్కదాన్నే ఉంటున్న. మా ముసలయ్య 20 ఏళ్ల కిందనే కాలం చేసిండు. నెల నెలా 2 వేల రూపాలు కేసీఆర్ ఇచ్చిన పింఛన్‌తోనే సంతోషంగా కాలం ఎల్లదీస్తున్న. కాంగ్రెసోళ్లు అచ్చినంక రెండు వేల పింఛన్‌ను 4 వేలు చేస్తరని చెప్పిన్రు. ఎప్పుడు పెంచుతరో ఏమో తెల్వదు కాని ఇప్పటికైతే కేసీఆర్ ఇచ్చిన పింఛనే అస్తున్నది.

- కుర్మె ఎర్రవ్వ, వృద్ధురాలు, నిర్మల్.

## కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇచ్చోడ, ఏప్రిల్ 10 : రాష్ట్రంలో 12 శాతానికిపైగా ఉన్న మాదిగలకు పార్లమెంట్ స్థానాల్లో అవకాశం కల్పించకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని బుధవారం పాత బస్టాండ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ మాదిగ మాట్లాడుతూ.. 17 పార్లమెంట్ స్థానాల్లో 4 శాతం లేని రెడ్లకు 6 స్థానాలు కేటాయించుకుని 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు రెండు స్థానాలు, 12 శాతానికిపైగా ఉన్న మాదిగలకు స్థానమే లేకుండా చేయడం ద్రోహం కాదా అని ప్రశ్నించారు. తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం మాలలతో కుమ్మక్కై రేవంత్‌రెడ్డి నమ్మిన మాదిగలను నట్టేట ముంచారన్నారు. దళితుల్లో 20 శాతం ఉన్న గళ్ల మాలలకు రెండు సీట్లు కేటాయించి, ఊరుకొక్కరు లేని బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చిన రేవంత్‌రెడ్డి, దళితుల్లో 75 శాతం మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బాక సుభాష్ మాదిగ, సిరిసిల్ల భూమయ్య మాదిగ, మచ్చ గంగయ్య, కల్లేపల్లి రాజు, గోటిముఖేలే మధూకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిట్టీ రవి మాదిగ, రాజు మాదిగ, విష్ణు మాదిగ, ఎమ్మెఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## అకాల వర్షంతో నష్టం

బోథ్, ఏప్రిల్ 10 : మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలకు నష్టం వాట్లిల్లింది. గంటపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పొచ్చెర, కుచ్లాపూర్, కౌఠ(బీ), సాకెర, సొనాల, ధన్నూర్(బీ) ప్రాంతాల్లో జొన్న పంట నేలవాలింది. కోతకు వచ్చిన జొన్న నేలవాలడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో కోత దశకు చేరుకున్న జొన్న, ఎర్రజొన్న, నువ్వుల పంటలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో మామిడి కాయలు నేలరాలాయి.

**కుంటాలలో..**

కుంటాల, ఏప్రిల్ 10 : మంగళవారం అర్ధ రాత్రి స్వల్ప వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో రైతులకు నష్టం జరిగింది. ఓలాలో భోజన్నకు చెందిన జొన్న పంట నేలవాలింది. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలతో నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**కుభీర్‌లో..**

కుభీర్, ఏప్రిల్ 10 : బలమైన గాలులతో కూడిన వర్షానికి కుభీర్‌తోపాటు పలు గ్రామాల్లో చేతికొచ్చిన మొక్కజొన్న నేలమట్టమైంది. ఇంకా జొన్న, నువ్వుల పంటలు గాలుల తీవ్రతకు నేలకొరిగాయి.



పొచ్చెర సమీపంలో నేలవాలిన జొన్న పంట



ఓలాలో అకాల వర్షానికి దెబ్బ తిన్న జొన్న పంట వద్ద రైతు భోజన్న

## నిండు గర్భిణీ మృతి



విమలాబాయి(ఫైల్)

ఇచ్చోడ, ఏప్రిల్ 10 : బాదిగూడ గ్రామానికి చెందిన ఎనిమిది నెలల గర్భిణీ పెందూర్ విమలాబాయి(25) మంగళవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన సాయికిరణ్‌కు సంవత్సరం క్రితం విమలాబాయితో వివాహమైంది. మొదటి కాన్పు కావడంతో విమలాబాయి తమ పుట్టినిల్లయిన బాదిగూడకు వెళ్లింది. మంగళవారం ఉదయం ఆమెకు వాంతులు, విరోచనాలు కావడంతో ఇచ్చోడ పీహెచ్‌సీకి ఆటోలో తరలించారు. ఇక్కడ పనిచేసే డాక్టర్ సాగర్ సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జి వైద్యులుగా బజార్‌హత్నూర్ పీహెచ్‌సీకి చెందిన కల్పన, భీంరావ్ ఉన్నారు. వారిద్దరు అందుబాటులో లేకపోవడంతో అక్కడ విధుల్లో ఉన్న ఏఎన్ఎం మౌనిక డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆమెకు గ్లూకోస్ పెట్టి వైద్యాన్ని ప్రారంభించారని భర్త సాయికిరణ్ తెలిపారు. రెండు గంటల తర్వాత మౌనిక విధులు పూర్తికావడంతో.. రెండో ఏఎన్ఎం అహల్య విధుల్లోకి వచ్చి మరో గ్లూకోస్ ఎక్కించిందన్నారు. దీంతో విమలాబాయి ఆరోగ్యం క్షిణించడంతో ఏఎన్ఎం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేసిందన్నారు. రిమ్స్‌లో పరీక్షించి కడుపులోని బిడ్డ, తల్లి మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారన్నారు.

### మక్కపంట దగ్ధం

భైంసా టౌన్, ఏప్రిల్ 10 : కుంసర గ్రామానికి చెందిన దేవేందర్ మక్క చేనులో విద్యుత్ నిప్పురవ్వలు పడడంతో దగ్ధమైంది. పంట కోతకు రావడంతో నూర్పిడి చేసేందుకు చేనులోనే ఉంచాడు. బుధవారం మధ్యాహ్నం చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు పడడంతో రెండెకరాల్లో సాగు చేసిన మక్క దగ్ధమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.


